అదృష్టం ఢిల్లీ వానలాంటిది.

అనుకున్నప్పుడు రాదు. అర్హతకల చోటికి రాదు.

వచ్చేనా, అకస్మాత్తుగా వస్తుంది. వచ్చింది కదా అని మురిసేలోగా అదృశ్యం అవుతుంది.

అయ్యో పోయిందే అనుకునేలోగా మళ్ళీ రావచ్చు. లేక, రాకపోవచ్చు...

వరద సుందర్రావు దగ్గరికి అదృష్టం చాల కాలంవరకు రాలేదు......అడ్రసు సరిగా వ్రాయని ఉత్తరం లాగున ఆలసించింది. అయితేనేం...... వచ్చినప్పుడు మాత్రం వరదలా వచ్చింది.

అది ఎట్లన్నన్?

* * *

మూడేళ్ళక్రిందట ఒక శ్రావణ సుముహూర్తాన వరద సుందర్రావుని, జానకి పెళ్ళాడింది.... ఏం, అలా ఎందుకనాలీ, వరద సుందర్రావే జానకిని పెళ్ళాడాడని ఎందు కనకూడదూ—అంటే?

అంతకు నాలుగు నెలల్కితం వేరే ఇంకొక పెళ్ళిలో—పొడుగాటి జుత్తును ఎడంచేత్తో ఎగదోసుకుంటూ, లాల్చీ పంచెలతో హడావిడిగా తిరుగుతూ, నవ్వుతూ, మాట్లాడుతూ, కళ్ళు తిప్పుతూ, కలకల లాడుతూ, తిరుగుతూవున్న—ఆ అబ్బాయిని జానకి అనే చిన్నది మొదట చూచింది

"వూ!"—అనుకుంది.

ఆ అనుకోవడం వరద సుందరం చెవులపడి అతగాడు కళ్ళతో.......'వూ?' అని అడిగాడు.

చూడని చూపుతో, నవ్వని నవ్వుతో....... జవాబు చెప్పకయే చెప్పి......ఒయ్యారంగా మెడ తిప్పి లోపలికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి. ఈ మూకీ ఏకాంకికను ఓరకంట గమనించిన ఆ అమ్మాయి ఒదిన కళ్యాణ కంకణం ధరించింది. వాళ్ళాయనతో 'ఆ' సంబంధం విషయం చూడమన్నది.

ఆ రాత్రి పేకాటలో వరద సుందరం ఇరవై నిముషాలలో ఇరవై రెండు రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇస్పేటు రాణిని క్రింద పడేస్తూ—"క.....ళ్ళు!" అన్నాడు. కళావరు పట్టుతీసి పెడుతూ, "ఆహా.....ఆమెడ!" అన్నాడు. ఆ పారాయణంలోని తతిమ్మా ముగ్గురూ—"సుందరాని కీవేళ వేడిచేసినట్లుంది, ఆట చాలిద్దాం" అని లేచారు.

.....జానకి అన్నయ్య, సుందరం నాన్నలు ఉత్తర, ప్రత్రాలు రాసుకోవడం, జాతకాల పొంతనాలు చద

వడం, పెళ్లి చూపులు జరగడం (ఇదంతా ఉత్త 'రెడ్—టేప్' అనుకోండి. అసలు నిర్ణయం అయిపోయింతర్వాత ఆఫీసు ఫైళ్లు తిరిగినట్లు)ఇదంతా అయింతర్వాత మంగళగిరి ఆలయంలో జానకీ సుందరాల కల్యాణం సలక్షణంగా జరిగింది..... ఇందులో 'ఇనిషియేటివ్' అన్నది—అనగా 'ఓం' అని కార్యంలోకి అడుగు వెయ్యడం అన్నది, జానకి కళ్ళనుండి బయలు దేరింది గనక, జానకి వరద సుందరాన్ని పెళ్ళాడింది — అవి (పై నెక్కడో ఒక పేరాలో) అగుపిస్తుంది.

తథాస్తు!

సరే, వివాహం జరిగింది. రెండు వైపులనుండీ బంధు మిత్రులు నాలుగు వందలమందిదాక వేంచేశారు. దాదాపు నాలుగు వందల బహుమతులూ వచ్చాయి. అందరూ కూడా వధూవరుల అదృష్టాన్ని అభినందించారు.

హడావిడి అంతా ముగిశాక, "మావూరు రా రాదూ? కొన్ని రోజులుండి వద్దురుగాని......" అంది జానకి ఒదిన.

సరికదా అని పెళ్ళికూతురూ, వాళ్ళాయనా కలిసి హైదరాబాదు చేరుకున్నారు......

.....వయసు మనసులు భూమిమీదే ఆకాశాన్ని సృషించుకుని ఎగిరాయి. ప్రపంచం క్రొత్త రంగు దాల్చింది.

ఒకరోజు—

దగ్గర కొస్తున్న సూరీడిని చూసి, పడమటింటివారి పడుచు సిగ్గు పడేవేళ—

"స్టెడీ జానకీ, స్టెడీ!—" అన్నాడు వరద సుందరం.

"ఒక్క నిముషం—" అని జానకి చీర కుచ్చెళ్లని సర్దుకుని నిల్చుంది.

సుందరం పెదవి విరిచాడు........"మళ్ళీ నువ్వు ఫోకస్‌లోనుండి బయటి కెళ్ళిపోయావు...... కాస్త ఇటువైపురా.......ఆ......అదీ.......మరీ అటు కాదు........ఆ జిన్నియాలు బొత్తిగా కనపడ్డం లేదు......" అని కెమెరాలోకి చూస్తూ సర్దుతున్నాడు..జానకి ప్రక్కగా ఒక గళ్ళలాగు కన్పించింది. కెమెరా కటకంలో తలెత్తి చూశాడు వరద సుందరం. పెద్ద మీసాలున్న గళ్ళలాగు ఆసామీ జానకికి కాస్త వెనక నిల్చుని చూస్తున్నాడు. వాణ్ణి క్రింద పడేసి వాడి ముక్కుని తొక్కువచ్చడిగా చేద్దామన్న చక్కటి అయిడియా వచ్చింది గాని.......వాడికీ చేతులున్నాయి. తనకూ ముక్కుంది ....వాడే తన అయిడియాని కాపీ గొడితే!...... అదీగాక, అది పబ్లిక్ గార్డనాయె....... వాడిని ఎలా వెళ్ళమనడం........ఛీ.......వెధవ ప్రపంచం... ప్రతి దానిని మరవకుండా చూస్తుంది కద!

ఈ పిడకల వేటంతా తెలియని జానకి, తన ఫోటో చిరునవ్వుని తీసి, అవతలవుంచి—"ఊ......" అంది.

కెమెరాతీసి, భుజానికి తగిలిస్తూ, "రా జానకీ, పోదాం—" అని నడిచాడు సుందరం. జానకి వెంబడించింది నాథుడిని—అబిడ్స్ అనబడే అయోధ్యకు.

ఆ అయోధ్య మధ్య వున్న అందమయిన, విశాలమయిన, ఖరీదయిన హొటల్లో కూచుని కాఫీని పిలిపించారా యువ దంపతులు.

కాఫీల పొగల తెరల చాటున కళ్ళూ కళ్ళూ పలకరించుకుంటుండగా—

వరద సుందరాన్ని గుమ్మంలోనే పసిగట్టి, చేతనున్న సిగరెట్టుని పారేయ నిచ్చగించనివాడయి, గబ గబ దాని ఆయుస్సుని అంతంచేసి, అరవై టన్నుల సంతోషంతో, అంతకు తగిన సర్వ మేళ వింపుతో—"వరద సుందరుడూ—ఒరేయ్" అంటూ వచ్చి వీపుని తట్టినవాడు మధుసూదనరావు...... 'సూదిరావు' అన్న నామాంతరంతో అనేకానేక ప్రేమచరితా ప్రచురిత, గేయా గేయాలను రాసినవాడు!

"ఏంవోయ్.......వరదా! నీకు పెళ్ళి అయింది కదూ........ఐమీన్......అయిందిలే........నేను రాలేకపోయానుగాని.......వూ! ఎట్లా అయింది పెళ్ళి? బాగా అయిందా, అవున్లే—కాకుండా ఎట్లా ఉంటుందిలే.......ఐ మీన్ అదే నీ పెళ్ళి బాగా అయిఉంటుందిలే........" అని గొడుగులేనివాడి నెత్తిన పిడుగు రాళ్లు వర్షించినట్లు, సంభాషణ అనబడే స్వగతం మొదలెట్లాడు సూదిరావు.

ఒకావిడ భీమా కంపెనీ మీద దావావేసి, ఇంతలో చచ్చిపోయింది. ప్రతివాది తరఫు న్యాయవాది "వాది చచ్చిపోయింది కనుక, కేసు కొట్టివేయాల్సిందని" కోరాడు.

వాదితరఫు న్యాయవాది అడిగాడు. "ఆమె చనిపోయిందని దాఖలా ఏమిటి?"

ప్రతివాది తరఫు న్యాయవాది చాలా జాగ్రత్తగా సమాధానం చెప్పాడు.

"ఆమె చనిపోయిందో లేదో నాకు తెలియదు. ఆవిడ దహన క్రియలు జరిగినట్లు మాత్రం నాకు తెలుసు."

రామయ్య (రెంటచింతల)

ఆ వరదలో పడి కొట్టుకు పోరాదనుకున్న వరద సుందరం—సూదిరావు పోకడకు చిన్న పోచంపాడు 'డాం' లాంటిది కట్టి—జానకిని పరిచయం చేశాడు. అవీ ఇవీ ఏవో అడిగాడు. మూడో కాఫీ తెప్పించాడు. కాఫీ అయిందికాని సూదిరావు విడవడే!

"రాకన్ మానవు హాని వృద్ధులు"—అన్న భర్తృహరి వాక్యాన్ని మననం చేసుకొన్నవాడయి, జానకితో లేచినాడు వరద సుందరుడు. కూడా వచ్చాడు గిరజాలు ఎగరేసుకుంటూ సూదిరావు. —బస్సుల మోత, బళ్ళ రద్దీ దాటి చిన్న వీధిలోకి వచ్చారు ఎవరూ మాట్లాడ్డంలేదు......ఒక్క సూదిరావే వర్షిస్తున్నాడు చెవిలోని జోరీగగా. సుందరం మనసు విషాదంతో మేకప్ మొదలెట్టింది. తమ లోకాన్ని ఆ పూట కలుషితం చేయడానికి మనుష్యులందరూ కలిసి కట్టుకున్న కంకణంలా కనుపించాడు సూదిరావు.......జానకి ఆదర్శ భారత సతియై పతివెంట నడుస్తూంది.

హఠాత్తుగా సూదిరావు ఒక అస్త్రం వదిలాడు—"వరదం! నీకూ—గేయాలు చదవడం ఇష్టమా......వినడం ఇష్టమా......?"

అపశంగా కొంతమంది నోళ్ళు కుట్టేయడం ఇష్టం—అని చెబుదామని జానకి అనుకుంది.... అవును........అనుకుంది, అంతే!

దైవోపహతుడు—వరద సుందరం—"గేయాలు చదివితేనే బాగుంటాయి—" అన్నాడు, ఆముదం కన్నా కూల్‌డ్రింకు మరోటి ఉండబోదన్న ఘోరణిలో......ఈ నిరాశ వెనకాల ఒక చిన్న ఆశాజ్యోతి జీరో వాట్‌ది, ఉంది. గేయాలు చదివితేనే బాగుంటాయి అంటే, ఆ గేయకర్త—'ఇదిగో చదివి చెప్పు' అని ఓ పుస్తకం చేతికివ్వవచ్చు. లేదా 'రేపిస్తాలే' నా సంపుటం' అనవచ్చు......మొత్తం మీద ఇప్పుడు తప్పించుకోవచ్చు......అన్నది సుందరం ఆలోచన. కాని, అప్పటి కయ్యది అప్రస్తుతమయింది. ఆ పూట అతడి అదృష్టం అధ్వాన్నంగా ఉండింది.....

"......ఆ......అదీ! నాకు తెలుసోయ్ నాకు తెలుసు......నీకు మంచి మంచి అభిరుచులున్నాయనీ........అయినా ఈ రోజుల్లో మాంచి టేస్టున్న వాళ్ళే అవుపడరోయ్.......ప్చ్ ప్చ్! ఇదిగో చూడు సుందరం! ప్రస్తుతం నా దగ్గర గేయాలేవీ లేవు గానీ......"

"అమ్మయ్య" అనుకోబోయాడు వరద.

"......గానీ నే నొక గేయం రాశాను 'శాంతి' మీద! అది నాకు కంఠంతా వచ్చు. చదువుతా విను......" అని ఒక చేత్తో సుందరం భుజం పట్టుకుని, నడి రోడ్డుమీద ఆపి, ఇంకో చేతిని భావయుక్తంగా కదిలిస్తూ, కళ్ళు మూస్తూ, తెరుస్తూ—గుహలో లోపలినుండి వచ్చే పులి గర్జనలాంటి స్వరంతో—

"కావాలి రావాలి
అందమయిన అమ్మాయి లాటి శాంతి
ఆనందపు అర్ణవమయిన శాంతి......
......అలాటి
శాంతికోసం అహర్నిశలు
ఆరాధన చేస్తున్నా......"

అంటూ మొదలెట్టాడు.

అతి కష్టంతో వరద సుందరం నడక సాగించాడు. వచ్చే పొయ్యేవాళ్ళు ఎగా దిగా చూడ్డం సిగ్గనిపించింది జానకికి.

ఎక్కుపెట్టి వదిలేసిన బాణం లాగున గాలిలోకి దూసుకు పోతుంది సూదిరావు గేయ స్వరం.

"శాంతి రాగం తపసులాగా
అలాపన చేస్తున్నా—
శాంతి దీపం వెలగాలని
ఆవాహన చేస్తున్నా—"......

జానకి నెమ్మదిగా సుందరం చొక్కా లాగింది.

తెగించాడు వరద......"ఒరేయ్ అబ్బాయ్ సూదీ! కాస్త మా ఆవిడ ఆరోగ్యం బాగులేదట—వస్తా......"

"మేదిమీద యుద్ధ పంకు......?......అబ్బెబ్బే.... అది గేయంలే! ఏవిటీ.....ఆరోగ్యమా.....ఓ! యూ మీన్ ఆరోగ్యమా......సరేసరే......ఒరేయ్ ఎలా ఉందంటావు గేయం......" అన్నాడు అక్కడే నిలబడిపోయిన సూదిరావు.

కోటి విద్యలు

"నీ గేయానికేరా దివ్యంగా ఉంది ...." అని గబగబ గంతులు వేసుకుంటూ నిష్క్రమించాడు వరద సుందరం—జానకిని లాక్కెడుతూ.

"దివ్యం దివ్యం—" అని రెండు సార్లు అనుకుని ఆపాటికి చీకటయి పోవడం గమనించి—వీధిలాంతరు క్రింద కెళ్ళి నిల్చుని చిన్న నోటు పుస్తకం తీసి, ఓ ఖాళీ పేజీ మూలగా, "దివ్యం, భవ్యం, నవ్యం" అన్న పదాలు ఒకదాని కింద ఒకటిగా రాసుకుని నడిచాడు సూదిరావు... ..

"అయినా మీకు అంత ఓపిక పనికి రాదండీ" అంది ఇల్లు చేరిన జానకి.

ఆమె మోహంచూసి తన యాతనంతా మరిచిపోయిన సుందరం అన్నాడు—"ఏం చెయ్యమన్నావు జానకీ, వాడు చిన్నప్పటినుండీ నాతో చదువుకున్నాడూ......"

అయినా......ఆయన మిత్రుల వరస బొత్తిగా నచ్చలేదా అమ్మాయికి. ఆ వూరు విడిచి పోతామని ఆ రాత్రే ఒదినతో చెప్పింది జానకి.

మరుసటి రోజు......అనేక తపాల ముద్రలూ ఎర్ర సిరా రాతలూ కల ఒక రిజిస్టర్ కవర్ వచ్చింది వరద సుందరరావుకి....

ఈ సందర్భంలో కథాంతరంగా ఒక్క విషయంబు నుడువవలె.

ఘనత వహించిన సర్కారువారి ఉద్యోగాలలో అనేక తరగతులూ, అనేక రకాలూ ఉన్నాయి అందులో ఒక్కటి 'తుమ్మితే వూడే ముక్కు రకం' ఒకటి. ....ఈ రకం ఉద్యోగాలలో పెద్ద వింత ఏవిటంటే—ఆఫీసు వాళ్ళు 'హాచ్!' అని ఓ కాయితం ఇస్తారు. అంటే ఇవతల ఆ కాగితం వాయినం పుచ్చుకున్నవాడికి ఉద్యోగం వూడిందన్నమాట! అలాటి వాటిని 9 ఏ 1 అనీ, 10 ఏ(1 అనీ అంటారు. . .అలాగంటే ఏవిటీ అని అర్థాలు అడక్కండి.. రూల్స్ నన్నిపోగలవు.

అయ్యలారా! ఇలాటి తొమ్మిదీ పదీ నెంబరు ఉద్యోగాలలో ఒక దానిని అలంకరించినవాడు వరద సుందరుడు.

జానకి కనుసీమల స్వర్గాలో, ఘుమ్మున విహరిస్తూ—తన సెలవు ఆరు రోజులే నన్నది మరిచిపోయి ఎద్దెనిమిది రోజుల దాకా, అదే—సూదిరావు గేయం వినే రోజు దాకా ఉండిపోయాడు సుందరం.

అలా ఉండిపోవడం ఫలితమే ఆ రిజిస్టర్డ్ కవరు రాజము.

కవర్ చదివి మడిచాడు వరద సుందరం.

నిన్నటినుండి ఘడియలు బాగులేవు.

ఫోటోలోకి గబ్బిలాలు మీసాలొచ్చాయి.

హోటలు కాఫీలోకి గేయాల సూదులొచ్చాయి.

ఈ పూట ఉద్యోగానికి జలుబు చేసింది.

ముక్కు తుడుచుకున్నాడు. వరద. పెళ్ళయి నెల దాటలేదు. ఉద్యోగం వూడింది ఎంత, ఎంత దారుణ పరిస్థితి!......అయినప్పటికీ సుందరరావు దుఃఖించెనా?

దుఃఖించనేలేదు.

"ఏవిటండీ అదీ....." అని ఎర్రగా పండిన తన నాలుకని చూచుకుంటూ అడిగింది జానకి.

ఒక క్షణం జానకిని చూశాడు సుందరం. తుంచేసిన మందార పువ్వుల్లా ఉన్నాయి......ఆమె పెదవులు.

"జానకీ......ఓ సారి నవ్వు......" అన్నాడు సుందరం

జానకి నవ్వింది—కళ్ళతో కారణం అడుగుతూ.

ఆ నవ్వుని చూసి.....'ఆ.....వెధవ ఉద్యోగం పోతే పోయింది లెద్దురూ...... అనుకున్నాడు ఆ నవ్వు గలావిడ వాళ్ళాయన.

జానకి చేతులమీద చెక్కిలినానించి మంచం మీద కూచుంది.

అందమయిన ఆ దృశ్యాన్ని మనసుమీద నిలుపుదామనుకుని ఓసారి కళ్ళు మూసుకున్నాడు సుందరం. మనసు తెరమీద మందార పువ్వులతో బాటు ఎర్ర తపాల ముద్రలూ కనుపించాయి....ఠొమ్మని కళ్ళు తెరిచేశాడు కళ్ళ నాయకుడు.....

మళ్ళీ ఓ క్షణం కళ్ళు మూసుకున్నాడు. చిటికెలు వేస్తూ గడ్డం గిల్లకున్నాడు. గడ్డం గిల్లుకుంటూ బుర్రగోక్కున్నాడు.

హఠాత్తుగా బాంబు పేలినట్లు—ఇవన్నీ మానేసి ఎగిరి గంతేశాడు.

"హా తెలిసెన్.....జానకీ......" అన్నాడు.

"నేను నిన్ననే చెప్పానా గేయాలు మంచివి కావనీ......మీకేమో ఇప్పుడు తెలిసొచ్చిందా?" అని పెదాలను నాలుకతో తడుపుకుంది జానకి.

"అబ్బే అది కాదు మైధిలీ, అదికాదు.....విను చెబుతా. ..." అని వరద సుందరరావు తన అయిడియాకు అక్షరాలతో ప్రాణం పోశాడు.

జానకి ఒప్పుకోలేదు. సందేహం సూచించింది. ఇంకేదన్నా ఆలోచిద్దాం అంది.

కాని, సుందరం కృతనిశ్చయుడయినాడు

*　　　*　　　*

ఇదంతా జరిగి ఏడాది కాలేదుగాని, వరద సుందరరావు కీనాడు అదృష్ట దేవత గొడుగు పడుతాంది. కారణం? అతడు పెట్టిన దుకాణం వెయ్యి చేతులతో ఆర్జించడమే ......పెళ్ళి వంటి సందర్భాలలో బంధు మిత్రు లందజేయవలసిన బహుమతిగాని—శిరమచ్చో వామ పాదమున తొలగం త్రోయించుకున్న శ్రీ కృష్ణులవారు సత్యాదేవికిచ్చే పారిజాత వృక్షంగాని—మంత్రిగారింటికి పంపవలసిన పార్సెలుగాని—ఏదయినాసరే, వరద సుందరరావు దూకాణంలో దొరకని వస్తువేలేదు! ప్రతీ సాయంకాలమూ గుంటూరు గుంటూరంతా అతడి కొట్లో ఉంటుందనడం కొంచెం మాత్రమే అతిశయోక్తి......

మరి ఈ మార్పు ఎలా సంభవించింది?

అలనాడు జానకీ సుందరులు గేయాన్ని విన్న మరురోజు—ఉద్యోగానికి తుమ్ము లొచ్చిన అవామాన్యపూట—ఆలోచనలో కళ్ళు మూసుకున్నప్పుడు, పెళ్ళిలో తమకు బహుమతిగా వచ్చిన

నలభై రెండు వెండి గంధపు గిన్నెలూ
పదిహేడు టాయిలెట్ సెట్లూ
తొమ్మిది వెండి లోటాలూ
ఎనభై పుస్తకాలూ
మూడు దంతపు కృష్ణుడి బొమ్మలూ
ఆరు నగల ఖాళీ పెట్టెలూ
ఇరవైఆరు ఫోటో ఫ్రేములూ
పన్నెండు టార్చిలైట్లూ
ముప్ఫైఐదు కుంకుమ భరిణలూ
పదహారు వెండి వెంకటేశ్వర్ల పటాలూ

వగైరా అంతా వరసగావచ్చి నిలిచాయి వరద సుందరం మనోవీధిని.

మారు మాట్లాడకుండా, పురాల్లోపోయి వాటిన్నిటినీ గాజా బీరువాలో పెట్టేసి బహుమతి వస్తువుల దుకాణం తెరిచినాడు—అదృష్టం వరించినవాడు—జానకీ నాధుడు. ★

బాధగా
అసహ్యంగా వుండే
గజ్జినుంచి
త్వరగా బయటపడండి



గజ్జి అంటువ్యాధి. అది మీ కుటుంబంలోని యితరులకు వ్యాపించకుండా వుండేందుకు ముందుగానే, మీరు అమృతాంజన్ లిమిటెడ్‌వారి డెర్మల్ ఆయింటుమెంటును వాడి త్వరగా, పూర్తిగా ఉపశమనం పొందండి. మళ్లీ ఆ అంటువ్యాధి తల యెత్తకుండా వుండాలంటే, మీరు తగిన జాగ్రత్త తీసుకోవడం అవసరం.

అమృతాంజన్ డెర్మల్ ఆయింటుమెంటు డబ్బా ఒకటి ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి. అది తామరకూ, పాసినకాళ్లకూ కూడా పనికివస్తుంది.

అమృతాంజన్
లిమిటెడ్ వారి
డెర్మల్
ఆయింట్‌మెంట్

అమృతాంజన్ లిమిటెడ్
14/15, లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూ ఢిల్లీ-1.